
# ప్రతిబింబాలు

గన్నిశెట్టి వెంకటేశ్వరరావు



అందరిలానే అచ్యుత రామయ్యగారూ మృత్యుదేవతముందు ఓటమి నంగీకరించక తప్పలేదు. నెలరోజులపాటు అహోరాత్రాలు మృత్యువుతో హోరాహోరి పోరాడిన ఆ వృద్ధమూర్తి మరణించి, అప్పుడే పదిహేడు రోజులు గడచిన్నై. ఆయన అర్థబలం, అంగబలం, అపారమైన కీర్తి ప్రతిష్ఠలు, డాబు దర్పాలు, ఇవేవీ ఆయన్ను ఆదుకోలేకపోయిన్నై పాపం!

ఆయన అంతస్తుకు తగిన విధంగా చాలా భారీయెత్తున కర్మకాండలు జరిపించి, 'తాతకు తగ్గ మనుమడు' అని నలుగురి ప్రశంసల నందుకోగలిగాడు హరిబాబు. అచ్యుతరామయ్యగారి పవిత్రాత్మ శాంతించి వుంటుందన్న భావనతో, బంధువర్గమంతా తృప్తిపడి వెళ్లిపోయాక, మేడమీద గదిలో ఒంటరిగా కూర్చుని జమా ఖర్చులు సరి చూచుకొంటున్న హరిబాబు దగ్గరకు వచ్చి, సన్నగా పొడిదగ్గు దగ్గాడు, అచ్యుత రామయ్యగారి ఆంతరంగిక కార్యదర్శి, ఆస్తిపాస్తుల ఆజమాయిషీ చూచే గుమాస్తా అయిన కుటుంబరావుగారు, తన రాక నాతడు గుర్తించటం కోసం.

'కూర్చోండి కుటుంబరావుగారూ.' అన్న హరిబాబు గొంతుకలో అచ్యుత రామయ్యగారు ధ్వనించటముతో కుటుంబరావు మేను పులకించింది. అదేరూపం. అదే దర్జా. అదే కంఠం! అంతా ఆయన ప్రతిబింబమే! తృప్తిగా నిట్టూర్చి ఎదురుగా వున్న పేము కుర్చీలో కూర్చున్నాడా ముసలి గుమాస్తా.

కొంతసేపు కుటుంబ వ్యవహారాలు, లావాదేవీలు పరిశీలించారిద్దరూ. కొత్త యజమానికి అవసరమైన వివరాలన్నీ తెలియపర్చి వెళ్లబోయేముందు, కాస్త తటపటాయిస్తున్న కుటుంబరావును చూచి 'ఇంకేమయినావుంటే రేపు చూద్దాం మీరు వెళ్లిరండి, ప్రొద్దు పోతోంది.' అన్నాడు హరిబాబు. ఫైళ్ళ బీరువాలో వుంచి తాళంవేస్తూ,

'రేపు సాయంత్రము మన మామిడి తోటవేపు వెళ్దామా బాబూ?' అన్న కుటుంబరావు ప్రశ్నకు, 'ఎందుకు?' అని ఎదురుప్రశ్న వేయకుండా. 'అలాగే' అన్నాడు హరిబాబు.

'ఈ తోట, ఈ కోనేరు అంటే మీ నాన్నగారికి పంచప్రాణాలు బాబూ! శేఖరంగారు గ్రామంలో వుంటే పగలంతా దాదాపు యిక్కడే గడిపేవారు!' అన్నాడు

# ప్రతిబింబాలు

కుటుంబరావు కోనేటిగట్టున కూర్చొని చూస్తూ; ఆ రెండవరోజు సాయంత్రం.

'నాన్నగారికా!' కొంచెము ఆశ్చర్యముగానే అన్నాడు హరిబాబు. కుటుంబరావుగారు ఈమధ్య ఏది మాట్లాడినా, అచ్యుతరామయ్యగారి మంచిచెడ్డలు గురించి, ఆయన అభిరుచుల గురించేగాని, తనతండ్రి విషయం ఎత్తటం వినలేదతను. ఒక్క కుటుంబరావేకాదు. ఈమధ్య తనతో ఎవరు మాట్లాడినా అచ్యుతరామయ్యగారి గురించే! అలాంటి దిప్పుడు అకస్మాత్తుగా ఏనాడో తనకు ఊహ తెలియని రోజులలో గతించిన తన తండ్రి చంద్రశేఖరంగారి ప్రస్తావన రావటం కొంచెము ఆశ్చర్యముగానే వుంది హరిబాబుకు కాని 'అలాగా' అని మాత్రమే అనగలిగాడు.

కొన్నిక్షణాలు మౌనంగానే గడచిపోయినై. కుటుంబరావుగారు దేన్ని గురించో తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. కొద్దిగా సంశయం, ఆందోళన అయన ముఖంలో తెరలు తెరలుగా తొంగి చూస్తున్నై. ఏదో చెప్పాలన్న ఆదుర్దా, చెప్పడానికి సందేహం!

హరిబాబు స్మృతిపథంలోనికి ఆయన బాల్యం తొంగి చూచింది. తనకు ఊహ తెలిసిన దగ్గరనుండి తనయింట్లో తనకు కనుపించినదల్లా తాతగారు మాత్రమే! ఆయనగారే తనకు తల్లి, తండ్రి, తాత అన్నీ. తనతండ్రి రూపాన్ని ఫోటోలోనైనా చూడగలిగేవాడు కాని, తనతల్లి ప్రతిరూపంకూడా తానెరుగడు. ఆ భవనంలో - అక్కడ పుట్టినవారివీ, మెట్టినవారివీ, చిన్నా—పెద్దా; అందరి ఫోటోలు వున్నై. జీవించివున్నవాళ్ళవీ, చనిపోయిన వాళ్ళవీ కూడా. కాని, తనకి జన్మనిచ్చినతల్లి రూపమే కరువైపోయింది. అది తనకు చాలా బాధగానే వుండేది. చిన్నతనంలో కూడా తాతగారిని అనేక సార్లు కదిపి చూచాడు. 'మాఅమ్మ ఫోటో ఎందుకులేదు తాతా?' అని. 'ఎందుకనో తీయించటము పడలేదురా!' అని కొన్నిసార్లు, ఆమె తీయించుకోడానికి ఒప్పుకోలేదని కొన్నిసార్లు చెప్పేవాడాయన.

ఎవరున్నా లేకపోయినా, తాతగారి మూలంగా ఆలోటు కనుపించ లేదింతవరకు. తనకేలోటూ రాకుండా ఆయన నీడలో పెరిగి పెద్దవాడయ్యాడింత కాలం. ఇప్పుడానీడ తొలగిపోయింది. తను పాతికేళ్ళ వాడవుతున్నా, ఎందుకనో, ఆయన లేకుండా ఎలా? అన్నభావం తనలో మెదిలి, తన అసహాయతను, అశక్తతను స్ఫురింజేస్తోంది. అది ఒక రకమైన భీతిని కల్పించుతోంది. కళ్ళు చెమ్మగిల్లినై; ఈ భావం రావటముతో హరిబాబుకు.

ఐతే ఈ విషయం కుటుంబరావు గ్రహించాడనుకోలేదతను 'బాబూ!' అని కుటుంబరావుగారు పలకరించటముతో త్రుళ్ళిపడి కొనగోటితో కనుకొలుకులనుండి జారటానికి ప్రయత్నిస్తున్న అశ్రుబిందువులను తుడిచేశాడు. కుటుంబరావుకూడా మరో నిమిషమువరకు నిశ్శబ్దముగా వుండి పోయాడు.

'తాతగారు అన్ని విషయాల్లోను న్యాయంగాను, ధర్మచ్యుతి లేకుండానే ప్రవర్తించేవారు, కాని...ఒక్క విషయంలోనే ఆయన సరైన మార్గంలో ఆలోచించలేక పోయారేమోననిపించేది బాబూ!' ఈ మాటలనడానికి ఆయన ఎంత బాధపడుతూ అంటున్నాడో వినేవాళ్ళకు తేలికగా అర్థమవుతుంది.

హరిబాబు చకితుడయ్యాడు—'కుటుంబరావుగారూ!' చాలా తగ్గు స్వరంలో అన్నాడు హరిబాబు. ఆయన మొహంలోనికి చూస్తూ 'ఏమిటి మీరంటున్నది?'

'అవును చినబాబూ!' గొంతు సర్దుకొని మాట్లాడుతున్నాడు కుటుంబరావు. 'ఆయన అందరి విషయంలోను న్యాయం చేయటానికే ప్రయత్నించేవారు. ఒక మీ అమ్మగారి విషయంలోనే అన్యాయం జరిగింది.' కళ్ళొత్తుకొన్నాడు కుటుంబరావుగారు. హరిబాబు దిగ్భ్రాంతి చెందాడు. కుటుంబరావుగారి ధోరణి అతనికేమీ అర్థం కాలేదు.

ఈ రోజు — ఏ అవసరం లేకుండానే తనను తోటలోనికి తీసుకరావటం — ఈ కోనేటి గట్టున కూర్చుండ బెట్టి, తనకు ఊహ రాకముందే గతించిన తల్లిదండ్రుల ప్రస్తావన తేవటం, అందులోను తన తల్లికి ఏదో అన్యాయం జరిగినట్లు ధ్వనించటం— ఇదంతా ఏదో తుఫాను రాబోయే ముందర వాతావరణంలా అనిపిస్తోంది హరిబాబుకు. అయినా చాలా నిబ్బరం కలవాడు కాబట్టి, పెద్దగా చలించనట్లు కనుపించాడతను చూచేవాళ్ళకు. 'సాక్షాత్తు ఆ తాతగారికి ప్రతిరూపమే!' అని కుటుంబరావుగారనుకోవటానికిదే కారణం. ఎన్ని తుఫానులొచ్చినా, మిన్నువిరిగి మీద పడుతున్నా వీసమెత్తయినా చలించటం అచ్యుతరామయ్యగారి జాతకంలో లేదు.



'మా అమ్మగారికి జరిగిన అన్యాయమేమిటి కుటుంబరావుగారూ!' తన దిగ్భ్రమ నుండి తేరుకుని చాలా తాపీగానే అడిగాడు హరిబాబు.

'ఈ విషయం మీకు ఎన్నటికీ తెలియకుండా వుండాలన్నదే తాతగారి అభిమతం. కాని... ఇది దాచడం యిహ నా వల్ల కాదు బాబూ!' ఆయన కంఠము వణికింది. రెండు క్షణాలు మౌనంతో తర్వాత కథ మొదలుపెట్ట గలిగాడు కుటుంబరావు.

తన జీవితానికి సంబంధించి, ఓ విచిత్ర కథ వుంటుందని గాని, ఏదో నవలలాగ, సినిమాలోలాగ, తను వినవలసి వస్తుందని గాని ఏనాడూ ఊహించి వుండని హరిబాబు చాలా ఆసక్తితో తన కథ వింటున్నాడా సాయంసంధ్యలో కోనేటి గట్టున కూర్చొని.

అచ్యుతరామయ్యగారు ఆ చుట్టుప్రక్కల పది గ్రామాలలో మంచి పలుకుబడి గలిగిన మోతుబరి ఆసామీ. తెల్లవాడి పరిపాలనలో సైతం జిల్లాకలెక్టరు లాంటి ప్రభుత్వోద్యోగులు కూడా ఆయనకు తమతోపాటు కుర్చీ యిచ్చి కూర్చుండ బెట్టేవారు. డబ్బుతోపాటు అపారమైన కీర్తి ప్రతిష్ఠలార్జించాడాయన రకరకాల వ్యాపారాలతో, వ్యాపకాలతో.

ఆయనకు చంద్రశేఖరంగారొక్కడే సంతానం. చంద్రశేఖరాన్ని తనకంటే గొప్పవాణ్ణి చేయాలని — తండ్రిని మించిన తనయుడనిపించాలని రేయింబవళ్ళు తపించి పోయేవాడా తండ్రి. అందుకే కొడుకుని పట్నం పంపించారు అచ్యుత రామయ్యగారు, 'లా' చదవటం కోసం. లాయరైతే లక్ష్మీ సరస్వతులింట్లో తాండవిస్తాయన్న ఆశ పాపం ఆయనగారికి!

కథలోని పాత్రలను తన యిష్టప్రకారం నడిపించుకుంటూ పోతున్న రచయిత హఠాత్తుగా అవి ఎదురుతిరిగి తమ స్వరూపాల్ని మార్చుకుంటే ఆ రచయిత స్థితి ఎలా వుంటుందో ఊహించి చూడండి.

కొండంత ఆశగా తనూహిస్తున్న కొడుకు తను కట్టుకొస్తున్న కోటగోడలు కూలద్రోస్తే ఏ తండ్రయినా ఎలా సహించగలడు?

ఎంతో బుద్ధిమంతుడని తను మురిసిపోతున్న చంద్రశేఖరం, 'స్వాతంత్ర్యము నా జన్మహక్కు' 'బానిస చదువులు నాకక్కర లేదు.' అని కాలేజీ వదలి ఖద్దరు టోపీతో బజార్న పడేసరికి, కడుపు తరుక్కుపోయింది అచ్యుత రామయ్యగారికి. కొడుకును అదుపులో పెట్టడం చాతకాక, తన అహం చంపుకోలేక, తన ఆశలు అడియాసలయిన పన్న ఉక్రోషము పట్టలేక, 'దారం తెగే వరకూ లాగిన అచ్యుతరామయ్య చివరకు కొడుకుని దూరం చేసుకున్నాడు పాపం!

తల్లిదండ్రుల్నీ, తన అంతస్తునీ, తృణప్రాయంగా వదలి వేసి కూలీ గుడిసెల మధ్య కాపురం పెట్టాడు చంద్రశేఖరం. ఒక సామాన్య కాంగ్రెసు కార్యకర్తగా, ప్రయివేటు బడిపంతులుగా బ్రతుకుతున్న అతన్నిచూచి ఏమీచేయలేక, బండికి కట్టిన పోట్లగిత్త తప్పించుకుని పారిపోతుంటే, పరిగెత్తలేక అలసిపోయి నిలబడిపోయిన బక్కరైతులా బాధపడుతున్నాడు అచ్యుత రామయ్యగారు.

అసలే రోగిష్టిగా వున్న చంద్రశేఖరం తల్లి శాంతమ్మగారు, కొడుకు దూరమైన దిగులుతో మరీ కృంగిపోయి, తనువు చాలించింది.

దీనికంతకూ కొడుకే కారణమని భావించిన అచ్యుతరామయ్య చంద్రశేఖరానికి, తల్లి కడసారి చూపు దొరకకుండా చేయడమే గాక దహన సంస్కారాలకు సైతం దరికి చేరకుండా చేసాడు కొడుకుని.

భార్య మరణంతో అచ్యుతరామయ్యగారికి కొడుకు మీద కక్ష పెరిగిందే కాని తరగలేదు. కుటుంబరావులాంటి సన్నిహితులెంతో ప్రయత్నించినా ఆయన్ని మార్చలేక పోయారు. చంద్రశేఖరం తన బ్రతుకు బాటను మార్చుకోలేదు. తండ్రి కొడుకుల జీవితాలు కలయని రైలు పట్టాలలా సాగి పోతున్నై.


సమాజంలో అత్యున్నత స్థాయి గల అచ్యుతరామయ్యగారి ఏకైక పుత్రుడు, ఒక మిల్లు కూలివాని కూతుర్ని, అందునా కులంగాని కులంలోని పిల్లను, పెళ్ళాడబోతున్నాడంటే, ఊరు నాడూ కోడై కూయకుండా ఎలా వుంటుంది?


అచ్యుతరామయ్యగారు నిప్పులు త్రొక్కిన కోతిలా మారిపోయాడు.

'ఎలాగైనా సరే, ఈ పెళ్ళి జరగకూడదు.' అన్నాడు కుటుంబరావును పిలచి. ఆయన అభిప్రాయమదైతే కావచ్చు—కాని జరగకుండా వుండదన్న విషయం కుటుంబరావుకు బాగా తెలుసు. కాని, యజమాని సంతృప్తి కోసం శతథా ప్రయత్నించి విఫలుడై, ఓడిపోయిన సిపాయిలా ఆయన ముందు నిలబడ్డాడు పాపం కుటుంబరావు.

మరోసారి ప్రత్యర్థి ఆటను కట్టించలేక పిచ్చెత్తిపోయిన అచ్యుతరామయ్యగారు 'పెళ్ళి గాదు వాడి శ్రాద్ధం.' అని శుభలేఖ చింపి పొయ్యిలో పారవేశాడు.

జీవితంలో మనం కావాలనుకొన్న మంచి జరక్క పోవచ్చుగాని చెడు కోరుకుంటే అతి త్వరగా జరిపోతూంటూందొక్కోసారి మతిలో యెంతుంటే, గతిలో అంత.'






కొన్ని ప్రాంతాల్లో దీనిని లక్ష్మి పురుగు అంటారు. సాధారణంగా మన ఇళ్ళల్లో బొద్దికలు కొంత అసౌకర్యాన్ని కల్గిస్తాయి. వంటగదులు, సామానుగదులు, స్నానాల గదులు—ఇలాటిచోట్ల వాటి ఉనికి. పగలంతా దాగి రాత్రిపూట తిరుగుతాయి. ఒక విధంగా మనకి ఉపయోగమే. మనం తిని వదలివేసిన ఆహారపుతునకల్ని తీసికొని శుభ్రపరుస్తాయి. పైగా కొన్ని పురుగుల్లాగా మనకు జబ్బుల్ని అందిస్తున్నట్లుకూడాలేదు. (దోమలు మలేరియా లాగా) అయినా వాటి ఉనికి వల్ల ఒక విధమైన కంపు వస్తుంది. వాటికి అవి మట్టుకు శుభ్రంగా ఉంటాయి శరీరం అంతా ఒక్కొక్క భాగం. నీటుగా చేసుకొంటుంది.

వీటికి తినడానికి ఏదైనా సామాన్యంగా పనికొస్తుంది. మనవేళ్ల చివర నుండే క్రొవ్వుని కొన్ని బొద్దికలు కొరుకుతాయి! స్టాంపులకున్న బంకను తింటాయి. గుడ్డల్నికూడా కొరికేస్తాయి. ఇవన్నీచేసి మనంతినే ఆహారాన్ని కలుషితం చేస్తాయి.

బొద్దికకు చాలాపొడవైన 'మీసాలు' ఉంటాయి. ఇవి జ్ఞానేంద్రియాలు. వాటితో తమ పరిసరాల్ని గ్రహిస్తాయి. మూడుజతలకాళ్ళ బలమైనవి కావడం వల్ల త్వరగా పరిగెట్ట గల్గుతాయి. రెండు జతల రెక్కలున్నా లోపలి జత మాత్రం ఎగరడానికి పనికొస్తుంది. పైజతరెక్కలు కేవలం రక్షణకు మాత్రమే.

శరీరం పల్చగా ఉండడంవల్ల బొరియల్లోకి సందుల్లోకి సులభంగాపోయి దాక్కోగలదు. ఆవిధంగా శత్రువులయిన బల్లులు, చుంచులు మానవులునుండి రక్షించుకొంటుంది.

ఆడబొద్దిక గుడ్లని కొన్నిటిని (సుమారు 16) ఒక పెట్టెమాదిరి దానిలోఉంచి భద్రమైన స్థలంలో పెడుతుంది. దానినుంచి పిల్లలు వస్తాయి. అవి అన్నివిధాల తల్లిలాగే ఉంటాయి. అయితే ముఖ్యంగా రెక్కలుండవు. ఎదిగి, కొన్నిసార్లు పొర (చర్మం) విడిచాక రెక్కలొస్తాయి!

—జమ్మి కోనేటిరావు

# ప్రతిబింబాలు

అనే సామెత రుజువవుతూంటుంది!

ఏ విష ఘడియను అచ్యుతరామయ్యగారామాటన్నాడో గాని, సంవత్సరం తిరక్క ముందే నిండు గర్భిణిగా వున్న భార్యను, ప్రేమతో పెంచి పెద్దవాడ్ని చేసి తన చుట్టూ ఎన్నో కలలు ప్రోగు చేసుకొని, వాటికి రూపకల్పన చేయలేక, ఆ కసిలో తనకు శత్రువుగామారిన తండ్రినీ వదలి. 'స్వరాజ్యం నా జన్మ హక్కు' అంటూ పరపీడన చెర వదల్చాలన్న దీక్షతో, స్వాతంత్ర్య సమరంలో లాఠీ దెబ్బలకు, చిత్రహింసలకు గురై పీడిత ప్రజల విముక్తి కోసం, జాతి ఔన్నత్యం కోసం, అసువులర్పించి అమరుడయ్యాడు చంద్రశేఖరం.

అచ్యుతరామయ్యగారు పసిబిడ్డలాగే ఏడ్చాడు. తనకు తాను చాలా ఎక్కువగా అంచనా కట్టుకున్న మనిషి తానేమీ కాదు అని తెలుసుకో గలిగినప్పుడు ఆ వ్యక్తి పడే బాధ వర్ణించడం చాలా కష్టం కాదా!

ఇప్పుడు—జీవితంలో ఆశలన్నీ అంతరించి — జీవితాకాశం మాయమబ్బులతో నిండిపోయి, బ్రతుకొక శాపంగా పరిణమించి అల్లాడిపోతున్న అచ్యుత రామయ్యగారి కిప్పుడు ఆత్మీయు లెక్కువయ్యారు. అంతోయింతో ఎంతదూరాన్నయినా సరే ఏదోఒకచోట చుట్టరిక మంటూ కలుపుకోవటానికి అవకాశం దొరికిన ఏ ఒక్కరూ, ఆయనకు దూరంగా వుండటానికి మనస్కరించక పాపం దగ్గరకు చేరుతున్నారాయన్నాదు కోవటానికి!

ఈ ముసురుతున్న ఈగలతో మరి బాధగా వుంది అచ్యుతరామయ్యగారికి. వీటిని తోలుకోలేక, ఈబాధ భరించలేక, కుటుంబరావును వెంటబెట్టుకొని తీర్థయాత్రలకని బయలు దేరాడు పాపమా అభాగ్యుడు.

తీర్థయాత్రలవలన పుణ్యమే వస్తుందో, పాపమే వస్తుందో తరవాత విషయం కాని అచ్యుతరామయ్యగారి విషయంలో మాత్రం మంచే జరిగింది యాత్రల మూలంగా.

చంద్రశేఖరంగారి భార్య గిరెమ్మకూ (గిరిజ చంద్రశేఖరం పెట్టుకున్నపేరు) మగపిల్లవాడు పుట్టినవార్త ఇంటిదగ్గరుండగానే విన్నప్పటికీ, కొడుకు పోయిన దిగులులో వున్న ముసలాయన ఏమీ పట్టించు

కోలేదు. తనకు సంబంధములేని వార్తగానే అనిపించిందప్పుడు.

కన్యాకుమారినుండి తిరిగి వస్తుండగా రైల్లో అన్నాడు అచ్యుత రామయ్యగారు; కుటుంబరావుతో. 'శేఖరానికి కొడుకు పుట్టాడనికదూ అన్నారు?'

ఉన్నట్లుండి ఆయన అలాగ అడగటం ఆశ్చర్యంగా వున్నా, కుటుంబరావుకెందుకో శుభ వాతావరణానికి నాందిగా కనిపించింది ప్రశ్న.

'అవును. మన మొకసారి చూసివస్తే బాగుంటుందేమో?' అన్నాడు కుటుంబరావు జంకుతూ.

ముసలాయన ఏ భావాన్ని ప్రదర్శించలేదు. విన్నాడా! లేదా! అన్న అనుమానం వచ్చింది కుటుంబరావుకు. కాని, అంతకుమించి ధైర్యము చెయ్యలేకపోయాడా క్షణాన.

ఆ తర్వాత ఇల్లు చేరేలోపల ఈ ప్రస్తావన ఇదరూ తేలేదు. కుటుంబరావు ఒకటి రెండుసార్లు మాట్లాడబోయి ఆగిపోయాడు.

'ఒక్కసారి అటువైపు వెళ్లి అసలు కుర్రాడెలావుంటాడో చూచిరాకూడదూ?' టౌను వెళ్తున్న కుటుంబరావు చెవిలో రహస్యంగా ఊదాడు అచ్యుతరామయ్యగారు. కుటుంబరావు సన్నగా నవ్వుకొన్నాడు.

చూచి రమ్మంటే కాల్చిరాగలడు కుటుంబరావు. సూదివట్టేసందు కనిపిస్తే ఏనుగులని తోలటానికి వెనుకాడడు. ఆయనలో బలవంతముగా అణచిపెట్టుకొస్తున్న గిరెమ్మ, ఆమె బిడ్డలమీద కల సానుభూతిని వెళ్లగక్కి బరువు తీర్చుకోగల తరుణం వస్తున్నదన్నభావం కలిగిందాయనకు. అందుకే త్వరత్వరగా కార్యరంగములోనికి దిగదల్చాడు.

పట్నంనుండివస్తూ, వస్తూ కుర్రాడి ఫోటోకూడా తీయించుకొచ్చి ముసలాయన చేతి కందించాడు.

'అంతా తమరూపే ననుకొంటాను?' ఫోటోవంక దీక్షగా చూస్తున్న ముసలాయన మొఖంలోనికి ఓరగాచూచాడు కుటుంబరావు.

ఆయన మొఖంలోని మెరుపు గమనించి తృప్తిగా గాలిపీల్చి వొదిలాడు. ముసలాయన చేతిలోనిఫోటో అనుకోకుండా ఆయన పెదాల దగ్గరకు నడచింది.

కుటుంబరావుకు చంద్రశేఖరం భార్యా బిడ్డలమీద ఎంతో సానుభూతివున్నా ముసలాయన మొండి ఘటమనితెలుసు కనుక బయటపడలేక పోయాడింత కాలం.

ఆ పసికందును తన వంశాంకురంగా అంగీకరించి గలిగిన అచ్యుతరామయ్యగారు, ఆ పసిగందుకు జన్మనిచ్చిన మాతృదేవిని తనింటి కోడలిగా స్వీకరించలేక పోయాడు. గిరెమ్మకు కావలసిన సదుపాయాలన్నీ సమకూర్చి బిడ్డను తన దగ్గరకు తీసుక రమ్మన్నాడు కుటుంబరావును.

బిడ్డ భవిష్యత్తును ఆలోచించిన గిరెమ్మ, తనబిడ్డను అచ్యుతరామయ్యగారి మనుమడిగా పంపటానికి అంగీకరించింది. కాని తనను కోడలిగా అంగీకరించలేని ఆ పెద్దమనిషి నుండి భరణం స్వీకరించలేనంది. అలాచేస్తే తనబిడ్డను అమ్ముకోవటమే అవుతుందని ఆమెభయం.

అందుకనే తాను నవమాసాలుమోసి కన్నబిడ్డను అచ్యుతరామయ్యగారికి అప్పగించి, తన మమతల్ని బలవంతముగా తెంచుకోగలిగింది మాతృమూర్తి; తనబిడ్డ సుఖంగావుంటే చాలునన్న భావంతో.

అది మొదలు హరిబాబు అచ్యుత రామయ్యగారి మనవడై పూరిగుడిసె వదలి అష్టయిశ్వర్యాల మధ్య పెర్గాడసాగాడు.

ఆ మాతృమూర్తి కటిక దరిద్రముతో కాలం గడుపుతూ ఆఖరికి కన్నబిడ్డను చూచుకొనే అదృష్టానికి సైతము దూరమై జీవితాన్ని భారంగా గడుపుతోంది. కుటుంబరావుగారి పుణ్యమాని ఎప్పుడైనా దూరంనుండే చూచుకోగలిగేది కొంతకాలం. బిడ్డకు ఊహవచ్చాక ఆమె కంటబడితే కొంపలు మునుగుతయ్యని ఆమెరాకను పూర్తిగా అరికట్టాడు అచ్యుత రామయ్యగారు. అప్పటి నుండీ ఆమె జీవచ్ఛవంలా బ్రతుకుతోంది. ఒక పూరిగుడిశెలో.

..........................

తన జీవితకథను విన్నతర్వాత, హరిబాబు ఎంత తల్లడిల్లి పోతాడోనని భయ




everest/363b/Acw

తల్లి! అచ్యుత రామయ్యగారి గుమాస్తా కుటుంబరావు—హరిబాబులోని విశృంఖలతను చూచి విస్తుపోయాడు.

ఏదో సినిమా కథను విన్నట్టు విన్నాడా కథను హరిబాబు.

'ఉదయం ఒకసారా ఊరెళ్లి వద్దాం' అన్నాడు. కొన్నిక్షణాల తర్వాత చాలా గంభీరంగా.

..............................

ఆ మరునాడు గిరెమ్మ వుంటున్న మురికిపేటలో ఖరీదైన కారాగింది. 'వెళ్లి చూచిరండి ఆమె ఉన్నదో లేదో' అన్నాడు హరిబాబు స్టీరింగు దగ్గరే కూర్చుని.

'గిరెమ్మా!' అంటూ గుడిసె ముందు కెళ్లి బిగ్గరగా పిలిచాడు కుటుంబరావు.

సన్నగా కొంచెం కురచగావున్న స్త్రీ ఆకారం బయటకు వచ్చింది. ఒకప్పుడు, అందం ఆకర్షణ అన్నీవున్న స్త్రీ లాగే వుంది. ఇప్పుడు వాటి ఛాయలు ఎంతో పరీక్షగా చూస్తే తప్ప కనుపించవామెలో. చాలా పాతదయిన చీర, రవిక ధరించింది. తల తైల సంస్కారం కరవై గడ్డి పరకల్లాగా లేగివున్నై వెంట్రుకలు. దైన్యాం తాండవిస్తుంది దామె ముఖంలో. కాని కళ్లల్లో లోలోపల ఏవో కాంతులు వెలికి రావాలని ప్రయత్నిస్తున్నయ్.

ఆమెతో ఒక పెద్దమనిషి మాట్లాడటం, ఆ సందు మొదట ఒక ఖరీదైన కారాగి వుండటం చూచిన ఆ వాడకట్టు పిన్నా పెద్దా అంతా ముసిరా రామెచుట్టూ—కారు చుట్టూను:

చాలా కాలంతర్వాత కుటుంబరావు రాక ఆమెకు ఏ భావాన్ని కలిగించలేదు. ఆయనెప్పుడైనా తను గుర్తొస్తే వచ్చి పలకరించి పోతుండటం జరుగుతూంటుంది.

'బాగున్నావా గిరెమ్మా?' చాలా ఉత్సాహంగా అడిగాడాయన. ఏదో కొంతగర్వం. 'చూశావా నీ కోసం నేను ... అన్నభావం వుందాయన గొంతుకలో, 'చాలా కాలానికి దయచేశారు!' అంది గిరెమ్మ వచ్చేదగ్గు నాపుకుంటూ. 'బాబు ...' ఆమెమాట పూర్తిచేయలేక పోయింది దగ్గుమూలాన.



సైఫన్ద్వారా కాలవలోని నీటిని మళ్లకు పెట్టేవిధానాన్ని అమెరికన్ వ్యవసాయ ఇంజనీరు శ్రీరాబర్ట్ హెచ్. డూబోయిస్ గరికబాద్‌లోని వ్యవసాయదారులకి ప్రదర్శిస్తున్నారు. కొత్త వ్యవసాయ పద్ధతులద్వారా ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ అభివృద్ధికి గత ఒకటిన్నర సంవత్సరాలుగా ఈయన కృషి చేస్తున్నారు.

నా బాబును తీసుకొచ్చావా! ఇక నీ కష్టాలు తీరిపోయినై'. ఆమెకేమీ అర్థం కాలేదు. 'బాబును తీసుకరావటమా!!!' తన చెవుల్ని తను నమ్మలేకపోయింది. 'అదుగో కారులో!' అన్నాడుత్సాహంగా కారువేపు చెయ్యిచూపుతూ. ఆమె దాదాపు మైమరచి పోయింది. 'నా బాబు! నా బాబు!' కారువైపుకు చకచక వెళుతుంది. ఆమె చుట్టూవున్న పిల్లలంతా ఆమె ననుసరించారు.

కారులో స్టీరింగుముందు కూర్చున్న హరిబాబు యిదంతా గమనిస్తూనేవున్నాడు. అతని కెందుకో గజిబిజి అయిపోయింది ఐదు నిమిషాలలో. ఆ మురికిపేట—దుర్గంధము—చింపిరి తలతో జీర్ణ వస్త్రాలతో, శవాకారంలోవున్న ఆ స్త్రీ, ఆమెచుట్టూ ఈగల్లా ముసురుకునివున్న ఆ పిల్లలు, ఆ వాతావరణం అతనికి చాలా జుగుప్స కలిగించాయి.

ఆమెకారు దగ్గరగా వస్తోంది. పదిగజాలైనా యెడంలే దింకా. అత నామెను విశితంగా చూశాడు.

'ఈమె—నా—తల్లి!'

అతని మనస్సెంత్లో ఆందోళన పడింది. తను, తన అంతస్థు, తన వంశ ప్రతిష్ఠ, చచ్చి స్వర్గంలోవున్న అచ్యుత రామయ్య గారు—వాటి ప్రక్కనే ఈ బికారి స్త్రీ, ఈ వాతావరణం.

భరించలేక పోయా డతను. తనకు తెలియకుండానే కారు స్టార్టు చేసుకొని ముందుకు వెళ్లిపోయాడు: ఆమె నాలుగు గజాల ఎడంలో వుండగా.

'బాబూ!' కుప్పలా కూలిపోయింది. మాతృమూర్తి.

ఆమెకు కొంచెం దూరంలో నిలబడి కొయ్యలా బిగుసుకు పోయాడు కుటుంబ రావుగారు.

'అవును. ఆ తాతకు — మనుమడు. అయన ప్రతిరూపమే! ఆయనలోని అహం, భేషజం, అన్నీ మూర్తీభవించి వున్నై హరిబాబులో ఆ వంశం—దానిలోని మనుషు లందరిలో ప్రవహించేది ఒకేరక్తం. కాని, అదేవంశంలో పుట్టిన హరిబాబు తండ్రి మాత్రం భిన్నంగా ఎలా వుండగలిగాడో అర్థంకాలేదు. కుటుంబరావుకు. ●